జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 78 20-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



## పెట్రోలు, డీజిల్‌పై తక్షణం వ్యాట్ తగ్గించాలి

**సీఎం రేవంత్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్**

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి మాటల గారడీలు పక్కనబెట్టి.. పెట్రోలు, డీజిల్‌పై తక్షణమే వ్యాట్ తగ్గించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన పన్ను వాటాను తగ్గిస్తే లీటర్ పెట్రోలు రూ. 100 లోపు వచ్చే అవకాశం

# ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం: ట్రంప్




- హోర్ముజ్ నుంచి మా 10 నౌకలను వెళ్లనివ్వడంతోనే ఈ ఉదారత: ట్రంప్
- దాడుల వాయిదా భారీ దాడి కోసమేనా?
- ఖెష్మ్, ఖార్గ్‌ల్లో ఒక దీవి స్వాధీనానికి ప్లాన్?
- ఇరాన్‌కు టోల్ కట్టాకే ఆ నౌకలకు అనుమతి?
- హోర్ముజ్‌లో చార్జీల వసూలుకు ఇరాన్ చట్టం?
- పెంటగాన్ వద్ద మళ్లీ పెరిగిన పిజ్జా ఆర్డర్లు!

వాషింగ్టన్, మార్చి 27: ఇరాన్‌లోని కీలక విద్యుత్, ఇంధన వ్యవస్థలపై దాడులను మరో పది రోజుల పాటు వాయిదా వేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఏప్రిల్ ఆరో తేదీ రాత్రి 8 గంటల వరకు దాడులు చేయవద్దని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. "ఒప్పందం కోసం వాళ్లు వారం రోజులు సమయం చాలా మర్యాదగా అడిగారు. నేను పది రోజులు

**కంపెనీలు పరిహారం చెల్లించాలి**

## ఏఐతో ఉద్యోగం కోల్పోతే..




- పెట్రోలు, డీజిల్‌పై.. ఎక్సైజ్ సుంకం భారీగా తగ్గింపు
- వాణిజ్య ఎల్‌పీజీ సరఫరా 70 శాతం పెంపు
- ఉద్యోగాలు కోల్పోయినవారికి ప్రభుత్వపరంగా నైపుణ్య శిక్షణ
- హార్వర్డ్ కెన్నడీ స్కూల్ ఏఐ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఓపెన్ ఏఐ సంస్థ చాట్ జీపీటీని ప్రారంభించిన తర్వాత ప్రతి ఒక్కరి జీవితంలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత భాగమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఏఐ కారణంగా అనేకమంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, ఈ సమస్యకు

మిగతా 2లో

## 100శాతం నష్టాన్ని కేంద్రం భరించాలి

- మొక్కజొన్న రైతును ఆదుకోండి
- ఏపీని ప్రత్యేక కేసుగా పరిగణించండి
- ధర లోటు చెల్లింపును అమలు చేయండి
- జూన్ వరకు పీడీపీ వర్తింపజేయాలి
- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి సీఎం లేఖ



అమరావతి, :మొక్కజొన్న పంటకు రాష్ట్రంలో ధర పడిపోయినందున మార్కెట్ జోక్యం పథకం(ఎంఐఎ?స)కింద ఏపీని ప్రత్యేక కేసుగా పరిగణించి, ధర లోటు చెల్లింపు(పీడీపీ)ను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు శుక్రవారం సీఎం లేఖ రాశారు. 2025-26 రబీ సీజన్‌లో రాష్ట్రంలో 4.83లక్షల హెక్టార్లలో మొక్కజొన్న సాగవ్వగా, 37.61 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా. అయితే మార్కెట్‌లో ధర పడిపోయినందున రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఏపీని ప్రత్యేక కేసుగా తీసుకుని, 50:50 నిష్పత్తికి బదులు 100శాతం నష్టాన్ని కేంద్రం భరించేలా చూడాలని సీఎం కోరారు. ఏపీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో మొక్కజొన్నకు ఎంఐఎస్ కింద ధర లోటు చెల్లింపు అమలు చేయడానికి నాఫెడ్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిని ఈ ఏడాది జూన్ వరకు

మిగతా 2లో

## అమరావతిపై మీ స్టాండ్ ఏంటి?

**జగన్‌కు మంత్రి లోకేశ్ సూటి ప్రశ్న**

అమరావతి రాజధాని అంశంపై వైసీపీ అధినేత జగన్ తన వైఖరిని స్పష్టం చేయాలని ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. "ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని మా నినాదం. అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. అమరావతి పై మీ స్టాండ్ ఏంటి జే టర్న్ జగన్ గారూ?" అంటూ సోషల్ మీడియా వేదికగా ఆయన సవాల్ విసిరారు. రాజధానిపై తమ ప్రభుత్వ విధానాన్ని స్పష్టం చేస్తూనే, జగన్ ను లోకేశ్ సూటిగా ప్రశ్నించారు.

మిగతా 2లో





## రక్షణ కొనుగోళ్లకు2.38 లక్షల కోట్లు

- ఇవన్నీ పాత విమానాల స్థానే..
- రూ.50 వేల కోట్లతో 5 ఎస్-400 స్క్వాడ్రన్లు
- రూ.45 వేల కోట్లతో రిమోట్ నియంత్రిత ఫైటర్ జెట్లు, డ్రోన్లు
- సైన్యానికి 300 ధనుష్ శతఘ్నులు.. డీఏసీ ఆమోదం
- మరింత పెరగనున్న రక్షణ సన్నద్ధత: రాజ్‌నాథ్‌సింగ్

2లో

## ఆటల బరిలోకి తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

నిత్యం రాజకీయాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే తెలంగాణ ప్రజాప్రతినిధులు ఆటల బరిలోకి దిగనున్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం 'లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్--2026' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి.



## పెట్రోలు, డీజిల్‌పై తక్షణం వ్యాట్ తగ్గించాలి

ఉందని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, సామాన్య, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలే పరమావధిగా కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించిందని గుర్తు చేశారు. కేంద్రం పన్నులు తగ్గిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యాట్ భారం సుమారు 35 శాతం ఉండటం వల్ల సామాన్యుడిపై పెనుభారం పడుతోందని అన్నారు. గత ప్రభుత్వాలు చేసిన అప్పులు, ఆయిల్ బాండ్ల భారం ఉన్నా కేంద్రం వెనక్కి తగ్గలేదని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పన్నుల రూపంలో ప్రజల రక్తాన్ని పిండుతోందని మండిపడ్డారు. పెట్రోల్ ధరలో కేంద్రం వాటా కంటే రాష్ట్రం వాటాయే ఎక్కువగా ఉండటం దురదృష్టకరమని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

## అమరావతిపై మీ స్టాండ్ ఏంటి?

## జగన్‌కు మంత్రి లోకేశ్ సూటి ప్రశ్న

అమరావతి రాజధాని అంశంపై వైసీపీ అధినేత జగన్ తన వైఖరిని స్పష్టం చేయాలని ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. "ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని మా నినాదం. అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. అమరావతి పై మీ స్టాండ్ ఏంటి జే టర్న్ జగన్ గారూ?" అంటూ సోషల్ మీడియా వేదికగా ఆయన సవాల్ విసిరారు. రాజధానిపై తమ ప్రభుత్వ విధానాన్ని స్పష్టం చేస్తూనే, జగన్ ను లోకేశ్ సూటిగా ప్రశ్నించారు.

మరోవైపు, తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో లోకేశ్ ట్వీట్ చేశారు. "తెలుగువారి ఆత్మగౌరవం కోసం, అణగారిన వర్గాలకు అండగా మన తెలుగుదేశం పార్టీ పుట్టి 44 సంవత్సరాలైంది. తెలుగుదేశం కుటుంబ సభ్యులమైన మనకు ఇది గర్వకారణమైన సందర్భం. ఆవిర్భావ స్ఫూర్తి, ఐకమత్యం చాటే సమయం ఇది. ఇది ఒక చిత్రం కాదు... రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమ, సకల శుభాల గెలుపుకు సంకేతమైన పసుపు జెండా ప్రస్థానం. మీ సోషల్ మీడియా ఖాతాలలో డీపీని పెట్టి, మీ ఇంటిపై పార్టీ జెండా ఎగరేసి 'నేను తెలుగు వాడిని... నాది తెలుగుదేశం పార్టీ' అని గర్వంగా చాటండి" అంటూ లోకేశ్ పిలుపునిచ్చారు.

## 100శాతం నష్టాన్ని కేంద్రం భరించాలి

కొనసాగించాలన్నారు. 'గతంతో పోల్చితే ఈ ఏడాది మొక్కజొన్న సాగు గణనీయంగా పెరిగింది. అదనపు ఉత్పత్తి కారణంగా స్పాట్ మార్కెట్ ట్రేడింగ్ మందకొడిగా ఉంది. ప్రస్తుత ధర కనీస మద్దతు ధర కన్నా తక్కువగా ఉంది. దిగుబడి గరిష్ఠంగా ఉండే కాలంలో ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు నష్టానికి అమ్ముకోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితి రైతుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందువల్ల ధరలను స్థిరీకరించడానికి, రైతుల ప్రయోజనాలను కాపాడటానికి సకాలంలో జోక్యం చేసుకోవాల్సిన తక్షణ అవసరం ఉంది' అని సీఎం లేఖలో పేర్కొన్నారు. కాగా మొక్కజొన్న ధర పడిపోయి, రైతులు నష్టపోతున్న విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణమే స్పందించి, కేంద్రానికి లేఖ రాసినట్లు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మీడియాకు చెప్పారు.

## అసెంబ్లీని నడపలేక రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రీడాపోటీల ఎత్తుగడ వేసింది: కేటీఆర్



ప్రభుత్వం సభను నడపలేక క్రీడా పోటీల ఎత్తుగడ వేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అసెంబ్లీ లాబీల్లో ఆయన పిచ్చాపాటిగా మాట్లాడుతూ, సభలో కీలకమైన అంశాలపై చర్చను పక్కన పెట్టేందుకు ప్రభుత్వం ఆటల పోటీలకు తెరతీస్తోందని విమర్శించారు. ఇరిగేషన్ వంటి కీలక పద్దులపై చర్చలు కొనసాగుతుండగా ఆటల పోటీలు ఎందుకని ప్రశ్నించారు. ఇదే అంశాన్ని తాను అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లానని, కానీ ఆయన వద్ద సమాధానం లేదని అన్నారు. ప్రభుత్వం ప్రజాసమస్యలపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కీలకమైన అంశాలపై చర్చలు జరగాల్సిన సమయంలో ప్రజాప్రతినిధులు మైదానాలలో ఆటలు ఆడుతుంటే ప్రజలు ఏమనుకుంటారని ప్రశ్నించారు. ఈ నెల 28, 29 తేదీల్లో ప్రభుత్వం క్రీడాపోటీలను నిర్వహించాలని నిర్ణయించిందని, కీలక అంశాలపై చర్చ సమయంలో ఇది సరికాదని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ సమావేశాలను ఆటలపోటీల వంటి కార్యక్రమాల పేరుతో వృథా చేయడమేమిటని ఆవేదన వ్యక్తం చేశారు. పద్దులపై చర్చకు సమయం కేటాయించకుండా సభా సమయాన్ని క్రీడలకు కేటాయించడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు.

## షేక్‌పేటలో గ్యాస్ సిలిండర్ల కోసం 'యుద్ధం'..

హైదరాబాద్ నగరంలో గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్ర రూపం దాల్చింది. సరఫరాలో జాప్యం కారణంగా విసిగిపోయిన వినియోగదారులు ఏకంగా డెలివరీ ఆటోను అడ్డుకుని సిలిండర్ల కోసం ఎగబడ్డారు. షేక్‌పేట జంక్షన్ సమీపంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్యాస్ ఏజెన్సీ నుంచి లోడ్‌తో వస్తున్న డెలివరీ ఆటోను స్థానికులు చుట్టుముట్టారు. గ్యాస్ బుక్ చేసి వారం రోజులు దాటినా సిలిండర్లు రావడం లేదని, ఏజెన్సీ సిబ్బంది సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటోలో ఉన్న సిలిండర్లను బలవంతంగా దించుకునేందుకు ప్రయత్నించడంతో అక్కడ కాసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే స్పందించిన గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది, కొందరు స్థానికులు వినియోగదారులను వారించారు. నిబంధనల ప్రకారం డెలివరీ చేయాల్సి ఉంటుందని, ఇలా చేయడం సరికాదని సర్దిచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. గత కొన్ని రోజులుగా నగరంలోని చాలా ప్రాంతాల్లో ఎల్పీజీ సిలిండర్ల సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సకాలంలో గ్యాస్ అందక సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని గ్యాస్ పంపిణీ వ్యవస్థను క్రమబద్ధీకరించాలని నగరవాసులు కోరుతున్నారు.

# ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం



ఇస్తున్నానని చెప్పా. హోర్ముజ్ జలసంధి నుంచి అమెరికా నౌకలను వెళ్లనివ్వడంతో దాడుల వాయిదాపై ఉదారంగా వ్యవహరించా.. చర్చల్లో భాగంగా తాము నిజాయతీగా ఉన్నామని చూపుకొనేందుకు ఎనిమిది పెద్ద చమురు నౌకలను పంపిస్తామని ఇరాన్ వాళ్లు చెప్పారు. ఆ ఎనిమిది నౌకలు హోర్ముజ్ జలసంధిని దాటి వస్తున్నాయి. అయితే తర్వాత మరో రెండు నౌకలను కూడా పంపిస్తున్నట్టు చెప్పారు. మొత్తం 10 పెద్ద చమురు నౌకలు వస్తున్నాయి. అవి పాకిస్థాన్ జెండాలతో వస్తున్నట్టు తెలిసింది" అని ట్రంప్ చెప్పారు. ఇరాన్‌తో చర్చలు ఫలవంతంగానే కొనసాగుతున్నాయని, ఒకవేళ ఇరాన్ ఒప్పందానికి రాకపోతే తీవ్రస్థాయిలో దాడి చేస్తామని పేర్కొన్నారు. చర్చల సందర్భంగా ఇరాన్ తనకు ఒక పెద్ద బహుమతి ఇచ్చిందని, అది చమురుకు సంబంధించినదని రెండు రోజుల క్రితం ట్రంప్ పేర్కొన్నా. ఇలా చమురు ట్యాంకర్లను వెళ్లనివ్వడమే ఆ బహుమతి అయి ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పాకిస్థాన్ జెండాలతో హోర్ముజ్ దాటిన అమెరికా చమురు నౌకలు ఇరాన్‌కు 'కప్పం' చెల్లించాకే ముందుకు కదిలాయనే వార్తలు వస్తున్నాయి. తగిన పత్రాలతోపాటు సుమారు రూ.19 కోట్లు (2 మిలియన్ డాలర్లు) చెల్లించాకే చమురు నౌకలను హోర్ముజ్ నుంచి అనుమతిస్తున్నామని ఇరాన్ అధికారులు స్పష్టం చేయడం గమనార్హం. "హోర్ముజ్ జలసంధిని దాటేందుకు ఒక్కో నౌక నుంచి 2 మిలియన్ డాలర్ల చొప్పున వసూలు చేస్తున్నాం. హోర్ముజ్‌పై ఇరాన్ సార్వభౌమత్వం నెలకొందనడానికి ఇది సూచిక" అని ఇరాన్ ఎంపీ అలాద్దీన్ బొరోజెర్ది ఆ దేశ ప్రభుత్వ చానెల్(ఐఆర్ఐబీ)లో ఈ విషయాన్ని ప్రకటించారు. హోర్ముజ్‌లో నౌకల నుంచి చార్జీలు వసూలు చేయడం కోసం చట్టాన్ని తీసుకురావడానికి కూడా ఇరాన్ సిద్ధమైంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు అమెరికా రోజుకు రూ.19 వేల కోట్లు (2 బిలియన్ డాలర్లు) ఖర్చు చేస్తోందని అమెరికా సెనేటర్ క్రిస్ మర్ఫీ మండిపడ్డారు. యుద్ధం కోసం రోజువారీగా చేస్తున్న ఖర్చు అంతకంటే ఎక్కువగానే ఉంటోందని చెప్పారు. అమెరికా దాడులకు ముందు హోర్ముజ్ తెరిచే ఉందని, అమెరికా తాను సృష్టించిన సమస్యను పరిష్కరించడం కోసం తానే తంటాలు పడుతోందని వ్యాఖ్యానించారు. భూతల దాడులకు సన్నద్ధత కోసమే వ్యూహాత్మకంగా ట్రంప్ దాడుల వాయిదా ప్రకటన చేశారనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. నిజానికి ఇరాన్ కీలక దీవి 'ఖార్గ్'ను స్వాధీనం చేసుకుని, విజయం సాధించామంటూ యుద్ధాన్ని నిలిపివేయాలని ట్రంప్ భావిస్తున్నారంటూ రెండు రోజుల క్రితమే వార్తలు వచ్చాయి.

# ఏఐతో ఉద్యోగం కోల్పోతే.. కంపెనీలు పరిహారం చెల్లించాలి



తమ ప్రభుత్వం వినూత్న పరిష్కారం అమల్లోకి తేబోతుందని తెలిపారు. ఏఐ వల్ల ఉద్యోగం కోల్పోతే.. ఆ ఉద్యోగికి కంపెనీ పరిహారం చెల్లించేలా ఒక విధానాన్ని తీసుకొస్తామని చెప్పారు. కంపెనీలు విడుదల చేసే కాలుష్యానికి కార్బన్ క్రెడిట్స్ ఉన్నవిధంగానే.. ఏఐ కంపెనీలకు 'పీపుల్ క్రెడిట్స్' విధానాన్ని అమలు చేయాలని ఆలోచిస్తున్నట్లు వివరించారు. అమెరికాలోని బోస్టన్ సిటీలో ఉన్న హార్వర్డ్ విశ్వ విద్యాలయంలోని హార్వర్డ్ కెన్నడీ స్కూల్.. ఏఐపై శుక్రవారం రాత్రి నిర్వహించిన సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడారు. మానవజాతి గొప్ప ఆవిష్కరణల్లో ఏఐ కీలకమైందని.. కానీ, ఇది రెండు వైపుల పదును ఉన్న కత్తి లాంటిదని అన్నారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రతికూల ప్రభావాలు ఎక్కువగా చూపవచ్చని హెచ్చరించారు. ఏఐ సాంకేతికత భవిష్యత్తులో మరింత శక్తిమంతమవుతుందని తెలిపారు. ఏఐతో ప్రాథమిక స్థాయి ఉద్యోగాల సంఖ్య తగ్గే అవకాశం ఉందని చెప్పారు. ఫార్మా, సాఫ్ట్‌వేర్, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, మ్యానుఫాక్చరింగ్, ఏరోస్పేస్, రక్షణ, రిటైల్ రంగాలకు కేంద్రంగా ఉన్న హైదరాబాద్ నగరం ఒక నాలెడ్జ్ సెంటర్ అని సీఎం తెలిపారు. ఈ రంగాల్లో భారీగా ఉద్యోగులను తొలగిస్తే తాము సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. అందుకే భారత్ ఫ్యూచర్ సిటీ అనే కొత్త నగరాన్ని నిర్మిస్తున్నామని, అందులో ఒక భాగాన్ని ఏఐ సిటీగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇక్కడ అన్ని ఏఐ సంస్థలకు ఒకేచోట అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఏఐ అభివృద్ధిలో ప్రపంచానికి కేంద్రంగా భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ప్రకటించారు. ఏఐ మార్చలేని పర్యాటకం, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాలు, మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో ఉద్యోగాలను పెంచుతున్నట్లు వివరించారు. గ్రీన్ ఎనర్జీ ఆధారంగా తయారీ రంగాన్ని అభివృద్ధి చేసి చైనా0 1కు ప్రత్యామ్నాయంగా ఎదగాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఉద్యోగాలు కోల్పోయే వారికి పున:శిక్షణ అందించేందుకు హార్వర్డ్ వంటి ప్రపంచ స్థాయి వర్సిటీలతో ఒప్పందాలు చేసుకుంటున్నట్లు చెప్పారు. తెలంగాణలో ఏఐ, గ్రీన్ ఎనర్జీ, ఇన్‌ఫ్రా రంగాలు పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణం ఉందని పేర్కొన్నారు.

## రక్షణ కొనుగోళ్లకు2.38 లక్షల కోట్లు



న్యూఢిల్లీ, త్రివిధ దళాలను బలోపేతం చేయటానికి రూ.2.38 లక్షల కోట్ల విలువైన ఆయుధాలను, రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సారథ్యంలోని 'రక్షణ కొనుగోళ్ల మండలి' (డీఏసీ) శుక్రవారం ఆమోదం తెలిపింది. దీనిపై రక్షణశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కొత్తగా కొనుగోలు చేసే వాటిలో.. వాయుసేన కోసం 60 మధ్యస్థాయి రవాణా విమానాలు ఉన్నాయి. ప్రస్తుతం వాయుసేన ఉపయోగిస్తున్న పాతబడిపోయిన ఏఎన్-32, ఐఎల్ 76 విమానాల స్థానంలో వీటిని వినియోగిస్తారు. కొత్త విమానాలు 18 నుంచి 30 టన్నుల పేలోడ్‌ను మోసుకెళ్లే సామర్థ్యంతో ఉంటాయి. కొనుగోలు చేసే మొత్తం 60 విమానాల్లో 12 వినియోగానికి సిద్ధంగా ఉన్నవి కాగా.. మిగిలిన వాటిని భారత్‌లో తయారు చేస్తారు. బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రార్ సీ-390, యూర్‌పనకు చెందిన ఏ400ఎం, అమెరికా కంపెనీ లాకీద్ మార్టిన్ రూపొందించే సీ-130జే విమానాలు రక్షణశాఖ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. 60 విమానాల కొనుగోలుకు రూ.లక్ష కోట్ల వ్యయం కానున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కొనుగోళ్ల కోసం డీఏసీ ఆమోదం తెలిపిన వాటిలో.. ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే 5 దీర్ఘశ్రేణి ఎస్-400 క్షిపణి వ్యవస్థల స్క్వాడ్రన్లు, ధనుష్ శతఘ్నులు, గగనతల రక్షణ నిఘా వ్యవస్థలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం వాయుసేన వద్ద మూడు స్క్వాడ్రన్ల ఎస్-400లున్నాయి. మరో రెండు ఈ ఏడాదిలోనే రానున్నాయి. ప్రస్తుతం ఆమోదం తెలిపిన ఐదు స్క్వాడ్రన్లు వీటికి అదనం. రూ.50 వేల కోట్లతో వీటిని కొనుగోలు చేయనున్నారు. దీంతో వాయుసేన వద్ద మొత్తం 10 స్క్వాడ్రన్ల ఎస్-400 వ్యవస్థలుంటాయి. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా భారత సైన్యానికి ఎస్-400లు బలమైన దన్నుగా నిలబడిన విషయం తెలిసిందే. మరోవైపు, వాయుసేన కోసం నాలుగు స్క్వాడ్రన్ల రిమోట్ నియంత్రిత ఫైటర్ విమానాలను (స్ట్రైక్ ఎయిర్‌క్ష?ఫ్టలు) దేశీయంగా కొనుగోలు చేస్తారు. వీటికి అయ్యే వ్యయం దాదాపు రూ.45 వేల కోట్లు. ప్రతీ స్క్వాడ్రన్‌లో 8 నుంచి 10 ఆయుధ సహిత డ్రోన్ వ్యవస్థలు ఉంటాయి. వీటిని శత్రువుల లక్ష్యాలను ఛేదించే మిషన్‌లలో ఉపయోగిస్తారు. దేశీయంగా తయారుచేసే 300 ధనుష్ శతఘ్నులను రూ.2,500 కోట్లతో సైన్యం కోసం కొనుగోలు చేయనున్నారు. ప్రస్తుతం సైన్యం వద్ద 114 ధనుష్ శతఘ్నులు ఉన్నాయి. ఎస్‌యూ-30 ఎంకేఐ యుద్ధ విమానాల సామర్థ్యాన్ని పెంచే ఏఐ-31 జెట్ ఇంజిన్లు, నౌకాదళం, తీరప్రాంత గస్తీదళం కోసం అవసరమైన హోవర్‌క్ష?ఫ్టలను కొనుగోలుకూ ఆమోదం లభించింది. వీటికి అదనంగా, సైన్యం కోసం రష్యా కంపెనీ రొసోబోరోన్‌ఎక్స్‌పోర్ట్ నుంచి రూ.445 కోట్ల విలువైన తుంగుస్క గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేయటానికి రక్షణశాఖ ఆ సంస్థతో శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. నౌకాదళానికి చెందిన పీ 81 తీరప్రాంత గస్తీ విమానాల నిర్వహణకు బోయింగ్ ఇండియాతో రూ.413 కోట్ల విలువైన ఒప్పందం కూడా కుదిరింది. ఈ కొనుగోళ్ల ద్వారా భారత రక్షణ సన్నద్ధత మరింత పెరుగుతుందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

## ఆటల బరిలోకి తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ఈ విషయాన్ని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభలో అధికారికంగా ప్రకటించారు. ఈ క్రీడల నిర్వహణ కోసం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఛైర్మన్‌గా, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కో-ఛైర్మన్‌గా ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాసనసభ్యులకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం. రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించడంతో పాటు రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని నింపడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. క్రీడలతో పాటు రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఘనంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా ఎమ్మెల్యే మకన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో పాటు మరో 13 మంది సభ్యులను నియమించారు. గురువారం నాడు కమిటీ సభ్యులు సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 28న మధ్యాహ్నం 3:30 గంటలకు ఎల్బీ స్టేడియంలో క్రీడలు ప్రారంభమవుతాయని కమిటీ స్పష్టం చేసింది. అంతకుముందు మంత్రులు, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి.. స్పీకర్‌ను కలిసి స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు.

## తెలంగాణ ఆర్ఆర్ఆర్: దక్షిణ భాగానికి కేంద్రం ఓకే.. మంత్రి గడ్కరీ లేఖ

తెలంగాణ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారీ ప్రక్రియను ప్రారంభించినట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ.. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి నిన్న లేఖ రాశారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని, డీపీఆర్ రూపకల్పన కోసం ఇప్పటికే ఒక ప్రత్యేక కన్సల్టెన్సీని కూడా నియమించినట్లు గడ్కరీ తన లేఖలో పేర్కొన్నారు. ఈ పరిణామంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. శ్రీరామనవమి సందర్భంగా ఇది తెలంగాణ ప్రజలకు శుభవార్త అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్నే మార్చే 'గేమ్ ఛేంజర్' అవుతుందని అన్నారు. తమ విజ్ఞప్తిని మన్నించిన కేంద్ర మంత్రి గడ్కరీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం

- వలిగొండలో వెల్లివిరిసిన మతసామరస్యం
- పట్టువస్త్రాలు సమర్పించిన సర్పంచ్ సాలెహా సలీం



**వలిగొండ, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. సీతారాముల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. మండల కేంద్రంలోని రామాలయంతో పాటు మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం, అక్కంపల్లి, రెడ్ల రేపాక, మాదాపురం, సంగెం తదితర గ్రామాల్లో వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య సీతమ్మ-రామయ్యల కల్యాణం నేత్రానందకరంగా సాగింది. వలిగొండ గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన కల్యాణ వేడుకల్లో స్థానిక సర్పంచ్ సాలెహా సలీం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మతసామరస్యానికి ప్రతీకగా ఆమె పంచాయతీ పాలకవర్గం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. 'జై శ్రీరామ్' నినాదాలతో పురవీధులు మారుమోగాయి. అనంతరం గుండా భాగ్యలక్ష్మి-చంద్రశేఖర్ దంపతుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బెలిదే నాగేశ్వర్, కందికట్ల లక్ష్మి గౌడ్, బీఎస్ఆర్ శ్రీనివాస్, పోలు నాగయ్య, జూలు శంకరయ్య, బర్ల నరసింహ, అన్నపర్తి బిక్షపతి, మైసోళ్ల సత్యం, బర్ల నాగార్జున, కొంపెల్లి సత్యనారాయణ, బుంగ శేఖర్, వంగాల శ్రీనివాస్, రేఖ కొమురయ్య, బుడిగె చెందు, ఎర్ర విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక

- ఏకగ్రీవంగా బాధ్యతల స్వీకారం; పారదర్శకతే లక్ష్యం: సర్పంచ్ అనూష

**రాజపేట, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** మండల పరిధిలోని సోమవారం గ్రామంలో వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థాన నూతన పాలక మండలి ఎన్నిక శుక్రవారం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ గొలుసుల అనూష యాకూబ్, ఉప సర్పంచ్ జంగ శ్రీకాంత్ మరియు గ్రామ పెద్దల సమక్షంలో ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం నూతన కమిటీ నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా సర్పంచ్ సూచించారు. ఆలయ గౌరవ అధ్యక్షులుగా గొంగిరెడ్డి మహేశ్వర్ రెడ్డి, శీలం అశోక్ రెడ్డి, అధ్యక్షుడిగా నారెడ్డి కమలాకర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చిన్నం సిద్దిరాజు, తవిటి కరుణాకర్, కోశాధికారిగా జంగ వేణు, ప్రధాన కార్యదర్శిగా శీలం శ్రీకాంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులుగా జొన్న నర్సిరెడ్డి, పుప్పాల నర్సయ్య, జంగ సిద్దులు, శీలం తిరుమలానందరెడ్డి, పుప్పాల సతీష్, బూడిద సురేష్‌లు ఎంపికయ్యారు. ఆలయ అర్చకులు మాటూరి సంతోష్ సమక్షంలో నూతన సభ్యులను గ్రామస్తులు, భక్తులు ఘనంగా సత్కరించారు.



# భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం





- వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

**రాజపేట, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** మండల వ్యాప్తంగా శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం ఆమె బేగంపేట, పారుపల్లి, రాజపేట మండల కేంద్రంలో జరిగిన వేడుకలకు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో స్వామివారిని దర్శించుకున్న ఆమెకు, ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆ సీతారాముల ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మాజీ జడ్పీటీసీ చామకూర గోపాల్, మదర్ డెయిరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పల్లె సంతోష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు బెడిద వీరేశం, మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్, నాయకులు ఎర్రగోకుల జశ్వంత్, కృష్ణ, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వరుడి కల్యాణ పోస్టర్ ఆవిష్కరణ



- వైభవంగా జాతర నిర్వహణకు ఏర్పాట్లు: ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**చౌటుప్పల్, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** మండల పరిధిలోని దండు మల్కాపూర్ గ్రామంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థాన కల్యాణ మహోత్సవం, జాతర ఉత్సవాల గోడ పత్రికను (పోస్టర్) స్థానిక శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కోమటిరెడ్డి లక్ష్మి శుక్రవారం ఆవిష్కరించారు. ఆలయ చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తుల ఆరాధ్య దైవమైన రామలింగేశ్వర స్వామి కల్యాణ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆంధోల్ మైసమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు సుక్క రవీందర్, వార్డు సభ్యులు ఈడుదుల ఇంద్రసేన యాదవ్, షేక్ అంజుం అంజద్, పక్కిర్ వంశీధర్ రెడ్డి, ఉప్పరి అనిల్ కుమార్, సిలువేరు శంకర్, ఎల్లంకి లింగాచారి, దౌడి లింగస్వామి, జెర్రిపోతుల అఖిల మహేందర్, ఆంధోల్ మైసమ్మ తల్లి దేవస్థానం ధర్మకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈడుదుల హరిప్రసాద్, చామట్ల శ్రీనివాస్, బొంతల యువరాజ్, గుండ్ల అశోక్, ఈడుదుల బాబు యాదవ్, ఈడుదుల కేశవ్ యాదవ్, బుర్ర శివ కుమార్ గౌడ్, బుర్ర విజయ్ గౌడ్, మహంకాళి పృథ్వీ పాల్గొన్నారు.

## రాజపేటలో కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

- భక్తిశ్రద్ధలతో వేడుకలు; హాజరైన మాజీ ఎమ్మెల్యే సునీత, బీజేపీ నేత అశోక్ గౌడ్



**రాజపేట, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** ఆకాశమే పందిరిగా.. భూదేవే వేదికగా అన్నట్లుగా రాజపేట మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి సేవా కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ నేతృత్వంలో ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎదుర్కోలు ఉత్సవం, కంకణ ధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాల వంటి ఘట్టాలను వేద మంత్రాల మధ్య అద్భుతంగా నిర్వహించారు. ఈ వేడుకలో మొత్తం 11 జంటలు పాల్గొని కల్యాణ తంతును పూర్తి చేశాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్ గౌడ్, ధ్యాన్ ఫౌండేషన్ నిర్వాహకురాలు పూనం తదితరులు పాల్గొన్నారు. 2005-06 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. రాత్రి జరిగిన పల్లకి సేవతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.





## డిసిసి ప్రధాన కార్యదర్శిగా మసిరెడ్డి సురేందర్ రెడ్డి

- నియామక పత్రాలు అందజేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**రాజపేట, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) కార్యవర్గంలో రాజపేట మండలానికి చెందిన ఇద్దరు నేతలకు చోటు దక్కింది. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగాయి. బొందుగుల గ్రామానికి చెందిన మసిరెడ్డి సురేందర్ రెడ్డిని డిసిసి ప్రధాన కార్యదర్శిగా, పిట్టల జయరాములను కార్యదర్శిగా నియమించారు. శుక్రవారం వారికి నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియమితులైన నాయకులు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగ పెంటయ్య గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాడోత్ విఠల్ నాయక్, సీనియర్ నాయకులు మెందు భాస్కర్ రెడ్డి, బొందుగుల గ్రామశాఖ అధ్యక్షుడు బాల్ద శ్రీకాంత్, శేఖర్, నరేష్, సంతోష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుర్రారంలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

- శ్రీరామనవమి పర్వదినాన శంకుస్థాపన; హిందూ ఐక్యతకు ప్రతీకగా నిర్వహణ

**రాజపేట, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** మండల పరిధిలోని కుర్రారం గ్రామ పంచాయతీ ఆవరణలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని హిందూ యువవాహిని ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధర్మ రక్షణ, హిందూ ఐక్యత, స్వాభిమానానికి ప్రతీకగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ధార్మిక కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయి. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ హిందూ యువవాహిని సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సామాజిక, ధార్మిక కార్యక్రమాలకు గ్రామస్తుల సహకారం ఉండాలని వారు ఆకాంక్షించారు.



# రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విప్లవరెడ్డి

- ఉత్కంఠ నడుమ ముగిసిన ఎన్నికల ప్రక్రియ
- భారీ మెజార్టీతో ఘన విజయం
- న్యాయవాదుల సంక్షేమానికే పెద్దపీట: గోలి విప్లవరెడ్డి



**ఎల్బీనగర్, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** రంగారెడ్డి జిల్లా న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) నూతన అధ్యక్షుడిగా గోలి విప్లవరెడ్డి ఎన్నికయ్యారు. గురువారం ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు అత్యంత ఉత్కంఠ భరితంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, అదే సమయంలో తీవ్ర పోటీ నడుమ కొనసాగింది. అనంతరం ఎన్నికల అధికారులు ఓట్ల లెక్కింపు చేపట్టి సాయంత్రం ఫలితాలను అధికారికంగా వెల్లడించారు. ఈ ఎన్నికల్లో గోలి విప్లవరెడ్డి తన సమీప ప్రత్యర్థిపై స్పష్టమైన, భారీ ఆధిక్యతను ప్రదర్శించి అధ్యక్ష పీఠాన్ని అధిష్టించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన విప్లవరెడ్డిని తోటి న్యాయవాదులు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై అపారమైన నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన న్యాయవాదులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న ప్రతి న్యాయవాది సంక్షేమమే తన ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా వృత్తిలోకి కొత్తగా వస్తున్న జూనియర్ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, కక్షిదారులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. తోటి న్యాయవాదులు తనకందించిన ఈ అఖండ విజయం తనపై మరింత బాధ్యతను పెంచిందని, అందరి సహకారంతో బార్ అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతానని విప్లవరెడ్డి ఉద్ఘాటించారు.

# అంగరంగ వైభవంగా రామయ్య పెళ్లి!



**వలిగొండ, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో శ్రీరామనవమి పర్వదిన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, కనుల పండువగా జరిగాయి. గ్రామంలో కొలువై ఉన్న పురాతన శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయం గురువారం సీతారాముల కల్యాణ మహోత్సవానికి వేదికైంది. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. స్వామి వారి కల్యాణోత్సవం సందర్భంగా పలువురు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. నక్కల మాధవరెడ్డి దంపతులు, కొలను మహేందర్ రెడ్డి దంపతులు, జక్క వెంకట్ రెడ్డి దంపతులు, కొలను రాంరెడ్డి దంపతులు సంయుక్తంగా స్వామి వారికి, అమ్మవారికి భక్తిభావంతో పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం వేద పండితులు, పురోహితులు పరమేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా ప్రారంభించారు. మిన్నంటిన వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణాన్ని అత్యంత ఘనంగా, కమనీయంగా నిర్వహించారు. ఈ అపురూప ఘట్టాన్ని వందలాది మంది భక్తులు కనులారా వీక్షించి తరించారు. ఈ సందర్భంగా వేద పండితులు పరమేశ్వర శాస్త్రి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. శ్రీరామచంద్రుని 14 ఏళ్ల అరణ్యవాస ఘట్టాలను, ఆనాటి కష్టాలను, అటు పిమ్మట జరిగిన శ్రీరామ పట్టాభిషేకం, రామరాజ్య పాలన విశిష్టతను భక్తులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. అనంతరం కట్ట ఉపేందర్ రెడ్డి, సౌమ్య దంపతుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమం (అన్న సమారాధన) విజయవంతంగా కొనసాగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేముల అనూష, ఉప సర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన అశేష భక్తజనం పాల్గొన్నారు.

# మునుగోడులో ప్రమాద రహిత రహదారుల నిర్మాణం: ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

- మలుపులు లేని రోడ్లే లక్ష్యం; 89 రహదారుల అభివృద్ధికి శ్రీకారం
- ప్రమాదపు మూలమలుపులు తొలగించి నాణ్యమైన రోడ్లు నిర్మిస్తాం





**మునుగోడు, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** మునుగోడు నియోజకవర్గంలో నాణ్యమైన, ప్రమాద రహిత రహదారుల నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొనేందుకు మునుగోడుకు వచ్చిన ఆయన క్యాంపు కార్యాలయంలో గ్రామస్తులు, ముఖ్య నాయకులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రమాదాలకు కారణమవుతున్న మూలమలుపులు, బ్లైండ్ స్పాట్స్‌ను గుర్తించి తొలగించి రోడ్లను సూటిగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న రోడ్ల పనుల్లో ఈ అంశాలను ప్రత్యేకంగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మునుగోడు నియోజకవర్గంలో 5.5 మీటర్ల వెడల్పుతో రోడ్ల అభివృద్ధి చేపట్టామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 67 రహదారులు, రోడ్లు ౘ భవనాల శాఖ ఆధ్వర్యంలో 22 రహదారుల పనులు కొనసాగుతున్నాయని వివరించారు. గ్రామాలకు వెళ్లే మార్గాల్లో ప్రమాదకర మలుపులు అధికంగా ఉన్నాయని గుర్తించామని, వాటిని తొలగించి సురక్షిత రహదారులుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదనంగా స్పీడ్ బ్రేకర్లు, గ్రామ శివారుల్లో సైన్ బోర్డులు, బ్లింకింగ్ లైట్స్ ఏర్పాటు చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అవసరమైతే తానే స్వయంగా పనులను పరిశీలించి ప్రమాద రహిత రహదారుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# సీతా కళ్యాణ వైభోగమే.. శ్రీరామ కళ్యాణ వైభోగమే

- వేదమంత్రాల సాక్షిగా జగదభిరాముడి పెళ్లివేడుక
- మొగిలిపాకలో అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



**వలిగొండ, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామం శ్రీరామనవమి పర్వదినాన భక్తిరసంతో నిండిపోయింది. సంప్రదాయబద్ధంగా ప్రతి ఏడాది నిర్వహించే సీతారాముల కళ్యాణం ఈసారి మరింత వైభవంగా జరిగింది. గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోగా, "జై శ్రీరామ్" నినాదాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అర్చకుడు కృష్ణమూర్తి శాస్త్రి వేదమంత్రోచ్చారణల మధ్య, మంగళవాయిద్యాల నాదాలతో సీతమ్మ--రాముల వారి దివ్య కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర వేడుకను తిలకించేందుకు గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు మాట్లాడుతూ పూర్వకాలం నుంచి శ్రీరామనవమి వేడుకలను గ్రామంలో ఐక్యంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు పాడిపంటలతో అభివృద్ధి చెందాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. భద్రాచల సీతారాముల కళ్యాణాన్ని ఆదర్శంగా తీసుకుని చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా వేడుకలను నిర్వహించడం మొగిలిపాక ప్రత్యేకతగా పేర్కొన్నారు. కళ్యాణం అనంతరం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత పులిపలుపుల అరుణ రాములు గౌడ్ తన తల్లిదండ్రులు కీర్తిశేషులు పులిపలుపుల సోమయ్య, యాదమ్మ స్మారకార్థం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముద్దసాని లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు ముద్దసాని జయసింహారెడ్డి, జక్కుల రాజమణి, జడిగే వెంకన్న, మొగిలిపాక పరశురాం, గ్రామ పెద్దలు మామిడి సత్తిరెడ్డి, పబ్బు ఎల్లయ్య గౌడ్, ముద్దసాని రాజశేఖర్ రెడ్డి, మొగిలిపాక గోపాల్, ముద్దసాని నవీన్ రెడ్డి, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి సన్మానం

- న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేయాలి: సర్పంచ్ మల్లారెడ్డి





**రామన్నపేట, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** రామన్నపేట బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి శుక్రవారం స్థానిక న్యాయవాదులు, ప్రజాప్రతినిధుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.డి. మజీద్, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన యాదాసు యాదయ్యలను కొమ్మాయిగూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామన్నపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ నూతన సారథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, ముఖ్యంగా కోర్టు ఆవరణలో మౌలిక సదుపాయాల కల్పనకు నూతన కార్యవర్గం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. న్యాయవాదుల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోదాసు పృథ్వీ, ఎం.డి. అక్రం, నోముల ప్రవీణ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తంగడపల్లిలో కనులపండువగా రామయ్య కల్యాణం

- ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దంపతులు,
- భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణ క్రతువు.. పోటెత్తిన భక్తజనం

**చౌటుప్పల్, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం జరిగిన ఈ కమనీయ వేడుకకు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆయన ధర్మపత్ని లక్ష్మి హాజరయ్యారు. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులు స్వామివారిని దర్శించుకుని, కల్యాణ క్రతువులో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ సాగిన ఈ వేడుకను భక్తులు భక్తిపారవశ్యంతో వీక్షించారు. కల్యాణానంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దంపతులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, బాలు మహేందర్, స్థానిక కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్ గౌడ్, ఊదరి యాదయ్య, గడ్డం ఇందిరా రాజరత్నం, ఆలే శ్రీలత చిరంజీవి, మాజీ సర్పంచ్ ముటుకుల్లోజు దయాకర చారి, మాజీ కౌన్సిలర్ ఆలే నాగరాజు, మాజీ ఎంపిటిసి గ్యార కృష్ణ, శ్రీరామనవమి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సిలివేరు నరసింహ, ఉపాధ్యక్షుడు అంతటి బాలరాజు గౌడ్, సభ్యులు ఇప్ప వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కేతరాజు శ్రీకాంత్, కార్యదర్శి చికూరి సాయి, సహాయ కార్యదర్శి చంద్రకాంత్, కోశాధికారి గుండెబోయిన వేణు యాదవ్, గౌరవాధ్యక్షులు కేతరాజు అచ్చయ్య, సద్గుణాచారి, ముసుకు శ్యాంసుందర్ రెడ్డి, పందుల రాజేష్, బత్తుల బద్రి, కొయ్యడ గాలయ్య, ఏదుళ్ల అరవింద్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వేణు రెడ్డి, నవీన్ రెడ్డి, బోద్దు ముత్యం, శ్రీను, పోలోజు గోవిందాచారి, బాలగోని వెంకటేశం, ముస్కు రాజేశ్వర్ రెడ్డి, చీకూరి ఇదయ్య, రావుల స్వామి, కందుల వెంకటేశం, జనగాం సురేష్, లింగస్వామి, డాకోజు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



# కమనీయం.. సీతారాముల కల్యాణం





- చౌటుప్పల్‌లో కనులపండువగా వేడుకలు
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దంపతులు
- పోటెత్తిన భక్తజనం.. ఆధ్యాత్మిక శోభతో పులకించిన పట్టణం

**చౌటుప్పల్, మార్చి 27 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ పట్టణం గురువారం ఆధ్యాత్మిక చైతన్యంతో పులకించిపోయింది. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో సీతారామచంద్రస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, కనులపండువగా జరిగింది. ఉదయం నుంచే వేదిక వద్ద వేదమంత్రోచ్చారణలు, సన్నాయి వాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ వేడుకను తిలకించేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులతో చౌటుప్పల్ వీధులన్నీ 'రామ నామ' స్మరణతో మారుమోగాయి. ఈ విశేష పర్వదినం సందర్భంగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆయన ధర్మపత్ని లక్ష్మి కల్యాణ వేదిక వద్ద స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు తంగడపల్లి గ్రామంలో జరిగిన వేడుకల్లోనూ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామయ్య ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మున్సిపాలిటీ పాలకవర్గం, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించగా, విద్యుద్దీపాల కాంతులతో పట్టణం దేదీప్యమానంగా వెలిగిపోయింది.



